క్లుప్తంగా

వైవీ, తాటిపర్తి జన్మదిన వేడుకలు



బ్రెడ్ పంపిణీ చేస్తున్న అరుణమ్మ

యర్రగొండపాలెం: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే, తాటిపర్తి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకురాలు ఉడుముల అరుణమ్మ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సన్‌జో మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో గురువారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేశారు. మానసిక దివ్యాంగులకు కేక్‌తో పాటు బ్రెడ్ పంపిణీ చేశారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రసాద్‌రావు

తాళ్లూరు: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా బహుళ ప్రయోజనాలతో పంట అధిక దిగుబడి వచ్చి రైతులకు లాభాలు వస్తాయని ఏవో బి.ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని తాళ్లూరు, కొత్రపాటివారిపాలెం, మల్కాపురం గ్రామాల్లో రైతులకు మట్టి నమూనాల సేకరణపై గురువారం అవగాహన కల్పించారు. మట్టి పరీక్షల ద్వారా స్థూల, సూక్ష్మ పోషకాల స్థాయి, సేంద్రియ కర్బనం స్థాయి తెలుస్తుందని చెప్పారు. వీఏఏలు వెంకట్రావు, అశోక్ పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్లలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు భక్తిశ్రద్ధలతో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో స్వామిని దర్శించుకున్న భక్తులు శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ప్రజల దాహం తీర్చేందుకే చలివేంద్రాలు



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

దొనకొండ: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని ఎస్‌ఐ టి.త్యాగరాజు కొనియాడారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు ఆదిమూలపు ప్రభుదాసు గురువారం తమ సొంత నిధులతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రం నిర్వాహకులు ప్రభుదాసును ఎస్‌ఐ అభినందించారు. మాజీ జెడ్పీటీసీ గుంటు జాకోబు, ఎండీ సుధాకర్, ఎం.సుధీర్, కె.మోహన్‌రావు, షేక్ రసూల్, ఐజక్ డయన్, విజయకుమార్, రవి పాల్గొన్నారు.

శారమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం



శారమ్మ ఇంటి వద్ద లయన్స్ క్లబ్ సభ్యులు

దర్శి (కురిచేడు): లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో మండలంలోని లంకోజనపల్లి గ్రామానికి చెందిన బండి శారమ్మ కుటుంబానికి రూ.11 వేల ఆర్థిక సాయం గురువారం చేశారు. పనుల కోసం ఆటోలో వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందిన శారమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి సాయం చేశారు. ఈ కార్యక్రమానికి రూ.6 వేల ఆర్థిక సాయం అందించిన డాక్టర్ మేడికొండ మల్లారెడ్డి, డాక్టర్ సద్ది తేజస్విని, శివారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి (మల్లారెడ్డి హాస్పటల్స్)కు లయన్స్ క్లబ్ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. లయన్ బిజ్జం నాగార్జునరెడ్డి, లయన్ యనుముల నర్సారెడ్డి, లయన్ చింతా తిరుపతిరెడ్డి, సీనియర్ లయన్ బూదాటి ఆంజనేయులు, లయన్ చేరెడ్డి ఇక్కారెడ్డి, లయన్ కల్లూరి విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా ఎన్విరాన్‌మెంట్ చైర్‌పర్సన్‌లకు లయన్స్ క్లబ్ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ ప్రెసిడెంగ్ తమ్మవరపు ఫణిబాబు, క్లబ్ సభ్యులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, సిరి,చాపలఖాశీంసాహెబ్, సుశీల పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాటం



దర్శి: డప్పులతో మేడే ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



కురిచేడు: ర్యాలీ చేస్తున్న కార్మికులు



పెద్దదోర్నాల: జెండా ఎగుర వేస్తున్న కృష్ణ, ఇతర నాయకులు

దర్శి (కురిచేడు): కార్మికుల హక్కుల కోసం ఎర్రజెండా పోరాడుతోందని, మేడే స్ఫూర్తిగా ఉద్యమాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. స్థానిక శ్రీనివాస థియేటర్ వద్ద గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని విధానం కోసం ఆనాడు పోరాడి కార్మికులు ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. మోదీ ప్రభుత్వం వచ్చి 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక, కార్పొరేట్లకు అనుకూలంగా 4 కోడ్ బిల్లులు అమలు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోందని, 8 గంటల పని విధానం పోతుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు ఐక్యంగా మే 20న జాతీయ సార్వత్రిక సమ్మెకు పిలుపు ఇచ్చాయని పేర్కొన్నారు. సీఐటీయూ మేడే ప్రదర్శన డప్పుల దరువులతో, కార్మిక గీతాలతో మహిళలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా నినదించారు. పొదిలి రోడ్డు ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏజెంట్లు జెండాను షేక్ కాలేషా, ఆటో వర్కర్స్ జెండాని ఇత్తడి కోటయ్య, అంకాల నాగయ్య, గడియార స్తంభం వద్ద సీఐటీయూ జెండాను అలూరి ఇస్మాయిల్, సీఐటీయూ ఆఫీసు వద్ద ఆశా, అంగన్‌వాడీల జెండాలను జాలా సుశీల, రత్నకుమారి, సీపీఎం ఆఫీసు వద్ద కేవీ పిచ్చయ్య, రాగిపిండి రామకోటిరెడ్డి, పోట్లూరి పుల్లయ్య తదితరులు ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ ఆఫీసు వద్ద ఎస్వీ రామ్మోహన్‌రావు జెండాలను ఆవిష్కరించారు.

కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి: ఏఐటీయూసీ

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను ఏఐటీయూసీ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమంతరావు మాట్లాడుతూ చికాగో నగరంలో ఎనిమిది గంటల పనిదినం సాధించుకోవటం కోసం శ్రామికులు పోరాటం చేసి ప్రాణాలర్పించారన్నారు. కురిచేడు రోడ్డులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ చేసి ర్యాలీ ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణతో ర్యాలీ ప్రదర్శన ముగిసింది. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద అన్నదానం చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్. కరుణానిధి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజి యాదవ్, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సింగరకొండ శ్రీను, విజయ్, మున్సిపల్ యూనియన్ నాయకులు ఇత్తడి ఇర్మియా, శ్రీకాంత్, నవీన్, ఒడిసె నాగేశ్వరరావు, వెంకటయ్య, ఆర్.సూరిబాబు, ఎస్ఎస్‌పీ యూనియన్ నాయకుల శేఖర్, కోటేశ్వరరావు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటరావు, శ్రీను, శివయ్య, ఆటో యూనియన్ నాయకులు సుబ్బారెడ్డి, సీహెచ్ అరుణ, అంజమ్మ, ఏఐటీయూసీ అనుబంధ ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కురిచేడు: ప్రస్తుతం కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే మేడే స్ఫూర్తితో పోరాడాలని సీఐటీయూ మండల గౌరవ అధ్యక్షుడు సందు వెంకటేశ్వరరావు అన్నారు. మేడే సందర్భంగా గురువారం కార్మిక సంఘాలు ర్యాలీ ప్రదర్శన నిర్వహించాయి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 8 గంటల పని దినం కోసం కార్మిక వర్గం పోరాటం చేసి సాధించుకున్న హక్కును మోదీ ప్రభుత్వం లేబర్ చట్టాల పేరుతో 12 గంటల పని భారాన్ని మోపేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశంలో ధరలు విపరీతంగా పెరుగుతుంటే కార్మిక వర్గానికి కనీస వేతనం రూ.21 వేలు అమలు చేయక పోవడంతో కార్మికులు అనేక దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. మేడే సందర్భంగా పంచాయతీ వర్కర్స్ యూనియన్ జెండాను కమ్మిలి అశోక్ కుమార్ ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మికుల సంఘ జెండాను పెనుగొండ సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ఆశా వర్కర్ల జెండాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద షేక్ గౌసియా ఎగురవేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జెండాను షేక్ ఫాతిమా ఎగురవేశారు. బిల్డింగ్ వర్కర్స్ నాయకులు గుంజా ఫణీంద్రకుమార్, కురంగి అయ్యప్ప, కంభంపాటి జడ్సన్, నుసుం వెలిగొండారెడ్డి, బండి మస్తాన్, గురవారెడ్డి, షేక్ మస్తాన్, మరియదాసు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.ఏసమ్మ, ఎల్.చిట్టెమ్మ, వై.లక్ష్మయ్య, బీసీహెచ్ నాసరయ్య, ఎల్.జార్జి, గండి శ్రీను, కె.సాల్మన్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు అంజలి, నాగలక్ష్మి, మల్లేశ్వరి, అంగన్‌వాడీ వర్కర్స్ నాయకులు రంగమ్మ, ప్రభావతి, మిడ్‌డే మీల్స్ వర్కర్స్ నాయకులు షేక్ ముంతాజ్ బేగం, వెంకట రమణమ్మ పాల్గొన్నారు.

పుల్లలచెరువు: కార్మికుల హక్కుల కోసం కలిసి పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యుడు కనకరత్నాచారి పిలుపు ఇచ్చారు. గురువారం మండల కేంద్రంలో సీపీఐ కన్వీనర్ గురునాథం ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో ఆయా పతాకాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం కలిసి పోరాల్సిన సమయం ఆసన్నమైందని, కార్మికులు శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. శ్రమ జీవుల హక్కులు కాపాడాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసాచారి, భవన నిర్మాణ కార్మికులు, ఆటో వర్కర్లు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండలంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పలు కార్మిక సంఘాలు మేడే వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాయి. సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం నాయకులు శీలం ఏసోబు, గోనా దావీద్, పానుగంటి పిచ్చయ్య, యూటీఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఒద్దుల వీరారెడ్డి, మొద్దు నాగేశ్వరరావు, షరీఫ్, తాపీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు రామిరెడ్డి కృష్ణయ్య జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మేడే విశిష్టత తెలిపారు. యూటీఎఫ్ నాయకులు మొద్దు నాగేశ్వరరావు, వర్ధన్, భవన నిర్మాణ కార్మికులు షేక్ మజున్ సాహెబ్, పంచాయితీ కార్మికుడు మిద్దె రంగస్వామి పాల్గొన్నారు.

దాచూరి స్మారకోపన్యాస సభకు రావాలి

దర్శి (కురిచేడు): స్థానిక యూటీఎఫ్ భవన్ వద్ద గురువారం మేడే సందర్భంగా యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి కార్మికులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. యూటీఎఫ్ నిర్మాత, ఎస్‌టీఎఫ్ఐ జాతీయ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా దర్శి డివిజన్ ఆధ్వర్యంలో జిల్లా యూటీఎఫ్ శాఖ పక్షాన స్మారకోపన్యాస సభ నిర్వహిస్తున్నామని జిల్లా కార్యదర్శులు మీనిగ శ్రీను, టి.రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు. సభలో విద్యారంగ పరిణామాలు, 2025 బదిలీల చట్టం, రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం, దాచూరి రామిరెడ్డి ఉపాధ్యాయ ఉద్యమానికి చేసిన సేవలను స్మరించుకోనున్నట్లు చెప్పారు. దర్శి డివిజన్‌లోని ఉపాధ్యాయులు కార్యక్రమానికి తరలి రావాలని కోరారు. పాత కోర్టు ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు దాచూరి పేరుపై దర్శి యూటీఎఫ్ తరఫున చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, ఆ తర్వాత గడియార స్తంభం వద్ద పీజీఎస్ కాంప్లెక్స్‌లో స్మారకోపన్యాస సభ జరుగుతుందని తెలిపారు. మండల అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.ఖాశీం, కోశాధికారి కె.రామారావు, గౌరవ అధ్యక్షుడు ఎం.యలమందారెడ్డి, కార్యదర్శి విజయ్ భాస్కర్, కె. రోశయ్య, రామాంజనేయులు, వీరాంజనేయులు, సీనియర్ బాధ్యులు వి.రామిరెడ్డి, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐటీయూసీ నాయకుడు జీవీ వెంకటేశ్వర్లు అన్నారు. మేడే సందర్భంగా గురువారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఆయన ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న కార్మికుల కష్టాన్ని బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని, పెట్టుబడిదారుల లాభాల కోసం రోజుకు 16 నుంచి 18 గంటల పాటు పనులు చేయించుకుంటూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తోందని, కార్మికులు పనులు చేసే ప్రాంతంలో కనీస రక్షణ ఏర్పాట్లు కూడా చేయడం లేదని అన్నారు. సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కేవీ కృష్ణగౌడ్, ఏఐటీయూసీ నాయకులు ఆవుల యోగయ్య, షేక్ పీరా, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



త్రిపురాంతకం: జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాసులు



దర్శి: మేడే పతాకావిష్కరణ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



పుల్లలచెరువు: జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు వెంకటేశ్వర్లు



సీఐటీయూ జెండాలతో కార్మికులు



ముండ్లమూరు: జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

దొనకొండ: సీఐటీయూ ఆధ్వర్యంలో కుందుర్తి చిన్న నరసింహులు అధ్యక్షతన గురువారం జరిగిన మేడే కార్యక్రమానికి మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య బస్టాండ్ సెంటర్‌లో మేడే జెండాను ఎగుర వేశారు. పొదిలి రోడ్డులోని సీఐటీయూ జెండాను సివిల్ సప్లయిస్ కార్మికుల అధ్యక్షుడు పగిడిపోగు ఆదాం ఎగుర వేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల అధ్యక్షుడు బాలకోటయ్య, కొండా ఏసుదాసు, ఇశ్రాయేలు, లూకయ్య, ఓర్పు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, సివిల్ సప్లయిస్ గోడౌన్ కార్మికులు పాల్గొన్నారు.

ముండ్లమూరు (కురిచేడు): మేడే సందర్భంగా మండలంలో కార్మికులు సంబరాలు నిర్వహించారు. మారెళ్ల, శంకరాపురంతో పాటు స్థానిక ఆర్‌ఆర్ నగర్ గ్రామాల్లో గురువారం సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం మేడే ఉత్సవాలు నిర్వహించింది. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ విధానాలను వేగంగా అమలు చేస్తోందని, కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక వర్గంపై బానిసత్వాన్ని రుద్దేందుకు ప్రయత్నిస్తోందన్నారు. బి.హనుమంతరావు, ఆంజనేయులు, తిరుపతమ్మ, ఎర్రయ్య పాల్గొన్నారు.

త్రిపురాంతకం: కార్మికుల అండ ఎర్రజెండా..అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి బానాల రామయ్య ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారులకు, కార్మికులకు జరిగిన ఘర్షణలో అనేకమంది అశువులు బాశారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు మల్లికార్జున, శ్రీను, వెంకటేశ్వర్లు, శాంతయ్య, కార్మికులు ఏ.శ్రీను, బి.శ్రీను, మస్తాన్, చెన్నయ్య, కోటి, నాసర్‌వలి, కోటి, వెంకటరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే తాటిపర్తి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రజలకు ఎమ్మెల్యే అభివాదం

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్‌జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్న ఆయన గృహం నుంచి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు వెళ్లి ఆయన ఆ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి నియోజకవర్గంలో ఉన్న పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీగా త్రిపురాంతకం రోడ్డులో ఉన్న వైష్ణవి గార్డెన్స్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో దాదాపు 40 మంది పాల్గొని తమ రక్తాన్ని దానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాటిపర్తి కేక్ కట్ చేశారు. కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, షేక్ అబ్దుల్ మజీద్, ఒంగోలు మూర్తిరెడ్డి, దొండేటి నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, ఆళ్ల ఆంజనేయరెడ్డి సుబ్బమ్మ, గుమ్మా ఎల్లేష్ పద్మజ, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, యేర్వ చలమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, గంటా వెంకటరమణారెడ్డి, త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘు మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాస్, వివిధ విభాగాల నాయకులు, ఆయా ప్రాంతాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యుద్దీపాలు ఆపి ముస్లింల నిరసన



చీకట్లో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

దొనకొండ: వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం రాత్రి 9 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ దీపాలు ఆపి చీకట్లో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా ముస్లిమ్స్ పర్సనల్ లా ఆదేశాల మేరకు వ్యాపార సంస్థలు, మసీదులు, వీధిలైట్లు, ఇళ్లల్లోని విద్యుత్ దీపాలు ఆపి నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎండీ ఖాశిం, సర్దార్, కరిముల్లా, రఫీ, అజీమ్, రసూల్ పాల్గొన్నారు.

సుందరయ్య భవన్‌కు కుర్చీల వితరణ



సుందరయ్య భవన్‌కు కుర్చీలు ఇస్తున్న తిరుపతిరెడ్డి

దర్శి (కురిచేడు): సుందరయ్య భవన్‌కు ప్రముఖ పారిశ్రామికవేత్త సానికొమ్ము తిరుపతిరెడ్డి 10 కుర్చీలను గురువారం బహూకరించారు. సుందరయ్య పేద ప్రజల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సుందరయ్య భవనం పనిచేయడం ఆనందంగా ఉందని, అందుకోసం కుర్చీలు తన తల్లి వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం బహూకరిస్తున్నట్లు తిరుపతిరెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. సీపీఎం జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు, ఎల్ఐసి యూనియన్ రాష్ట్ర నాయకులు రాగిపిండి రామకోటిరెడ్డి, సందు వెంకటేశ్వరరావు, పుల్లయ్య, తాండవ రంగారావు, కేవీ పిచ్చయ్య, ఉప్పు మోహన్‌రావు, షేక్ కాలేబాషా పాల్గొన్నారు.

బూచేపల్లికి కుమ్మిత కృతజ్ఞతలు



బూచేపల్లిని సత్కరిస్తున్న అంజిరెడ్డి

దర్శి (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసన సభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మలకు ఆ పార్టీ రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి గురువారం కృతజ్ఞతలు తెలిపారు. చీమకుర్తిలోని వారి నివాసానికి స్థానిక నాయకులతో కలిసి వెళ్లి అంజిరెడ్డి తనకు రాష్ట్ర స్థాయిలో ప్రధాన కార్యదర్శిగా పదవి వచ్చేలా కృషి చేసినందుకు ఎమ్మెల్యే బూచేపల్లి, జెడ్పీ చైర్మన్ వెంకాయమ్మను గజమాలతో సన్మానించారు. డీసీఎం మాజీ డైరెక్టర్ చెన్నారెడ్డి, ముండ్లమూరు మండల పార్టీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సూదిదేవర అంజయ్య, నియోజకవర్గ రైతు సంఘ అధ్యక్షుడు నాగిరెడ్డి, జేసీఎస్ మాజీ కన్వీనర్ బత్తినేని వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ చైర్మన్ అమీన్ బాషా, కౌన్సిలర్ బాబూరావు, బీసీ సెల్ నాయకులు అన్నవరపు వెంకట రవి, మాజీ సర్పంచ్ ఉడుముల వెంకటరెడ్డి, మండల పార్టీ నాయకులు భిక్షాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు డగ్లస్, గర్రెపూడి రాజేష్, సచివాలయ మాజీ కన్వీనర్లు కొనిదన అనీల్, ఎస్.నాగేశ్వరరెడ్డి, బి.సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, గిరి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా అడ్మిషన్లు



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

పెద్దారవీడు: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా అడ్మిషన్లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ ప్రగడ శ్రీనివాసులు కోరారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతి నుంచి ఉచితంగా చదువుకునేందుకు 25 శాతం రాయితీ కల్పించారన్నారు. ఉచిత ప్రవేశాలకు షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, బలహీన వర్గాలు, దివ్యాంగులు, మైనార్టీలు, అనాథ పిల్లలు, ఓసీ అల్పాదాయ వర్గాల వారు అర్హులని చెప్పారు. అర్హులైన 5 సంవత్సరాలు నిండిన బాల బాలికలు మే 2 నుంచి 15వ తేదీ లోపు సచివాలయం, మీసేవా, ఇంటర్నెట్ సెంటర్స్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు నమోదు చేసుకోవాలని, ఆధార్ కార్డు, ఓటరు కార్డు, రేషన్ కార్డుతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటో అవసరం ఉంటుందని తెలిపారు. మండలం పరిధిలో తోకపల్లి పంచాయతీ హనుమాన్ జంక్షన్ కుంటలో సిద్ధార్థ ప్రైమరీ స్కూల్ పరిధిలో చుట్టూ మూడు కిలోమీటర్ల దూరం ఉన్న గ్రామాల వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంఈఓ కోరారు.

తాళ్లూరు: విద్యా హక్కు చట్టం ప్రకారం 2025–2026 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో మండలంలోని ఎనిమిది ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు సుబ్బయ్య, సుధాకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఐదేళ్లు నిండిన వారై ఉండాలని చెప్పారు.

వేసవి శిక్షణతో వ్యక్తిత్వ వికాసం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడగాయని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం శిక్షణ శిబిరానికి 35 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్, తెలుగు గ్రామర్, డ్రాయింగ్ తదితర అంశాలపై ఇస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, పీవీ గురుస్వామి పాల్గొన్నారు.